# సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

**అగ్నిధార న్యూస్,( రామగుండం) :**

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ, కమ్యూనిస్టు మేధావి అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఎర్రజెండా పార్టీల ఐక్యతకు కృషి చేసిన మహానేత అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొని కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. భూపోరాటాల ద్వారా నిరుపేదలకు ఇంటి స్థలాలు సాధించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, నల్గొండ ఎంపీగా ప్రజలకు సేవలందించారని, జాతీయ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు.

చివరి శ్వాస వరకు ప్రజా ఉద్యమాలకు అంకితమైన సుధాకర్‌రెడ్డి స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షత వహించగా కార్పొరేటర్ సూర్య, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, ఆగస్టు- 22:**



పెద్దపల్లి జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న జాతీయ మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు కార్యాచరణ పథకం కింద జిల్లా డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం, మాదకద్రవ్యాల బారిన పడిన వారికి చికిత్స, పునరావాసం, అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థలు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన ఈ-అనుదాన్ పోర్టల్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. దరఖాస్తులను ఈ-అనుదాన్ పోర్టల్ ద్వారా సమర్పించాలని, ఇతర వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో పనివేళల్లో నేరుగా, 9440852495 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన మహిళా అధ్యక్షురాలికి శుభాకాంక్షలు



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్ నూతన గృహప్రవేశం సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు నిండాలని ఆకాంక్షించారు.

## బహుజన రాజ్య నిర్మాణానికి టీఆర్‌పీని బలోపేతం చేయాలి



**అగ్ని ధార న్యూస్ ,(మంచిర్యాల) :**

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఏకం చేసి బహుజన రాజ్యాన్ని స్థాపించాలన్నదే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లక్ష్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బహుజన వర్గాలకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదని, ఇక జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనుల రాజ్య నిర్మాణం కోసం అగ్రవర్ణ పార్టీలను వీడి టీఆర్‌పీలో చేరి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంచిర్యాలలో బీసీ జెండా ఎగురవేయాలని కోరారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**అగ్ని ధార న్యూస్,(పెద్దపల్లి) :**

కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు సీఐటీయూ పోరాటం కొనసాగుతుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేడర్ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి ఎర్రబెల్లి ముత్యంరావు తరగతులను ప్రారంభించారు. 'భారత కార్మికోద్యమ చరిత్ర-- సీఐటీయూ విశిష్టత' అంశంపై కూరపాటి రమేష్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతుండగా.. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటి అమలుకు ప్రయత్నించడం విరుద్ధ వైఖరికి నిదర్శనమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గాన్ని చైతన్యపరచాలని కేడర్‌కు సూచించారు. జిల్లా నలుమూలల నుంచి సీఐటీయూ ప్రతినిధులు తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌గా జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి వ్యవహరించగా.. జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఉపాధ్యక్షుడు ఎన్.బిక్షపతి, సహాయ కార్యదర్శులు ఎస్.రవీందర్, జి.జ్యోతి, వనజరాణి, జిల్లా కమిటీ సభ్యులు జి.లక్ష్మారెడ్డి, తుంగపిండి మల్లేష్, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ విగ్రహ దిమ్మె కూల్చడం అరాచకం



**అగ్నిధార న్యూస్ ,(రామగిరి) :**

పోలీసు కాల్పుల్లో మృతిచెందిన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెను కూల్చడం అరాచక చర్య అని హైకోర్టు న్యాయవాది డీ. సురేష్ అన్నారు. శనివారం పౌరహక్కుల సంఘం నాయకులతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించి నిరసన తెలిపారు. 1979లో ఆందోళనల సమయంలో పోలీసుల కాల్పుల్లో పుట్ట నారాయణ మృతిచెందారని, ఆయన కుటుంబానికి ఇప్పటికీ న్యాయం జరగలేదని సురేష్ పేర్కొన్నారు. 2023లో ముస్త్యాల కమాన్ బోర్డు వద్ద విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరగా అప్పటి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ సింగరేణి అధికారుల సూచనల మేరకు నిర్మించిన విగ్రహ దిమ్మెను ఏప్రిల్ 2న కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో కూల్చివేశారని ఆరోపించారు. నారాయణ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు విగ్రహ ఏర్పాటుకు అనుమతులు కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో పలువురు పౌరహక్కుల సంఘం నాయకులు, నారాయణ కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ ఆత్మవిమర్శ చేసుకోవాలి



**అగ్నిధార న్యూస్ ,( రామగుండం) :**

మంత్రి కొండా సురేఖ తన కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం విచారకరమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తల త్యాగాలతో పాటు రేవంత్‌రెడ్డి పోరాటం కీలకమైందన్నారు. అర్హులు ఎంతోమంది ఉన్నప్పటికీ సీనియర్ నాయకురాలిగా గుర్తించి కొండా సురేఖకు మంత్రి పదవి కల్పించారని తెలిపారు. ఒకవైపు మంత్రి పదవిని అనుభవిస్తూ మరోవైపు ముఖ్యమంత్రి, ఆయన సోదరులపై కుటుంబ సభ్యులు విమర్శలు చేయడం సరికాదన్నారు. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని చెప్పడం సమంజసం కాదని, ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండించాలని రాజ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యవహారశైలితో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## మంత్రి కొండా సురేఖ ఆత్మవిమర్శ చేసుకోవాలి

**అగ్నిధార న్యూస్,,( హైదరాబాద్):**

మంత్రి కొండా సురేఖ తన కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడంపై ఆత్మవిమర్శ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద సహచర విప్‌లు, ఎమ్మెల్యేలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల త్యాగాలు, సీఎం రేవంత్‌రెడ్డి పోరాటం కీలకమన్నారు. అర్హులైన పలువురు ఉన్నప్పటికీ సీనియర్ నాయకురాలిగా గుర్తించి కొండా సురేఖకు మంత్రి పదవి కల్పించారని తెలిపారు. ఒకవైపు మంత్రి పదవిలో కొనసాగుతూ మరోవైపు ఆమె కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ఆయన సోదరులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని చెప్పడం సమంజసం కాదని, ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండించాలని విజయరమణారావు డిమాండ్ చేశారు.




## ఆటోడ్రైవర్ల బంద్‌కు సంపూర్ణ మద్దతు




**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఈ నెల 24న చేపట్టనున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ)తో పాటు పలు ఆటో యూనియన్ల నాయకులతో కలిసి బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలతో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సేవలు ప్రారంభించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆటోడ్రైవర్లతోనే ఈ సేవలను నిర్వహించాలని కోరారు. ఆటో, రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో యాప్ ఏర్పాటు చేయాలని, హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు.

**శిశువు మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆమె.. ప్రసవం కోసం చేరిన గర్భిణికి సకాలంలో వైద్యం అందకపోవడంతోనే శిశువు మృతి చెందినట్లు ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఇంపాక్ట్ ట్రైనర్లు దేవి లక్ష్మీనర్సయ్య, మేజిక్ రాజా, సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ, వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్ అన్నారు. విద్యానగర్‌లోని సింగరేణి హైస్కూల్‌లో శనివారం 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సును కోరే శ్రేయోభిలాషులని, వారి సూచనలను పాటించాలని సూచించారు. మితిమీరిన సామాజిక మాధ్యమాల వినియోగం చదువుతో పాటు భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనమవుతాయని, వాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ అలవాటు పడవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ మనోహర్ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ప్రశ్నలే పునాది

**'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలను ఖండించిన డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్ (హైదరాబాద్):**




ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం, ఉద్యోగాలు కోరడం, ధరల పెరుగుదలపై గళమెత్తడం పౌరుల హక్కులని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని నక్సల్ మనస్తత్వంతో పోల్చడం సమంజసం కాదన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిరసనకారులను దేశద్రోహులుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రధాని వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ స్పందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ లోపాలను ప్రశ్నించే పౌరులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించడం మానుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలని డా. నగేష్ డిమాండ్ చేశారు.

